క్లుప్తంగా

నేటి నుంచి షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్‌లో ఉన్న షిర్డీ సాయిబాబా దేవాలయ వార్షికోత్సవాన్ని సోమవారం నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సాయిబాబాకు అభిషేకంతో వార్షికోత్సవ పూజలు ప్రారంభమవుతాయి. గణపతి పూజ, అంకుర్పారణ, గోత్రనామాలు నిర్వహిస్తారు. 15న ఉదయం సుప్రభాత సేవ, కాగడహారతి, విఘ్నేశ్వర పూజ, దీపారాధన, మండపారాధన తదితర పూజలు నిర్వహిస్తారు. 16న సుప్రభాత సేవ, కాగడహారతి, 21 కలశాలతో స్వామివారికి అభిషేకం, దత్తాత్రేయ మహామంత్ర సాయి మూల అనుష్టాన హోమాలు, కుంభాభిషేకం, పూర్ణాహుతి, సాయంత్రం పల్లకీసేవ నిర్వహించనున్నారు. ఆలయ ధర్మకర్త పద్మజా గోపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



రాజాపూర్: మండలంలోని రాయపల్లి శివారులో ఉన్న పురాతన వీరాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం గ్రామస్తులు భూమిపూజ చేశారు. పురాతన దేవాలయ పునర్నిర్మాణానికి గ్రామ యువత ముందుకువచ్చినట్లు వారు తెలిపారు. సమాజంలో చేసే మంచి పనులు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూరి బాబుగౌడ్, ప్రవీణ్, శ్రీకాంత్‌గౌడ్, శేఖర్, లక్ష్మయ్య, నవీన్‌గౌడ్, ఎర్రన్న పాల్గొన్నారు.

నిరసన ర్యాలీని విజయవంతం చేయండి

స్టేషన్ మహబూబ్‌నగర్: వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆల్ పార్టీ ముస్లిం లీడర్స్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ మోసీన్‌ఖాన్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముస్లింల మతస్వేచ్ఛను హరించేందుకు బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు తీసుకువచ్చిందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే నిరసన ర్యాలీలో ముస్లింలు, ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు తఖీహుస్సేన్, మిర్జా ఖుద్దూస్‌బేగ్, హాఫిజ్ ఇద్రీస్, బదివుల్లా బేగ్ పాల్గొన్నారు.

సంతలో అన్నదానం



నవాబుపేట: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సంతలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి గత 34 వారాలుగా వారాంతపు సంతలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. వారాంతపు సంతకు దాదాపు 70 గ్రామాలకు చెందిన ప్రజలు వస్తుంటారు. అన్నదాన కార్యక్రమంతో ప్రజల ఆకలి తీరుతుంది. కార్యక్రమంలో వ్యాపారం సంఘం మండల అధ్యక్షుడు సుధాకరాచారి, పుట్టి ఆంజనేయులు, నిరంజన్, విశ్వనేత్ర, శర్మ, బాబ్లు, వెంకటయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మిడ్జిల్: మండలంలోని మసిగొండ్లపల్లికి చెందిన వడ్ల అంజయ్య శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ సుమతమ్మ, గోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి.. రూ. 20వేల ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా ఇటీవల గ్రామంలో మృతి చెందిన ఎర్రోళ్ల ఆశన్న కుటుంబానికి రూ. 5వేల ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. వారి వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాండుయాదవ్, నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, సుదర్శన్, శ్రీను, అశ్ఫక్, కృష్ణారెడ్డి, మతీన్, భీంరాజ్ ఉన్నారు.

ఇద్దరికి గాయాలు

మహమ్మదాబాద్: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలైన ఘటన గండేడ్ మండలం గొల్లగడ్డలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఆశిరెడ్డిపల్లికి చెందిన సురేష్, జానంపల్లికి చెందిన భీమయ్య ద్విచక్ర వాహనంపై కోస్గి నుంచి గండేడ్ వైపు వస్తూ.. కోస్గి వైపు బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు ఢీకొన్నారు. ప్రమాదంలో సురేష్, భీమయ్యలకు గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రమణీయం.. రథోత్సవం



ధర్మాపూర్‌లో దేవతా మూర్తుల రథాన్ని లాగుతున్న భక్తులు

- ధర్మాపూర్‌లో రథంపై ఊరేగిన రుక్మిణి పాండురంగస్వామి
- భక్తి పారవశ్యంతో పులకించిపోయిన భక్తులు



గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీకపిలాద్రి రుక్మిణి పాండురంగస్వామి

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని ధర్మాపూర్ కల్లంగుట్టపై వెలసిన శ్రీకపిలాద్రి రుక్మిణి సమేత పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి రుక్మిణి పాండురంగస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా శోభాయమానంగా అలంకరించిన గరుడ వాహనంపై రుక్మిణి పాండురంగస్వామి ఉత్సవ మూర్తులను కల్యాణ మండపం నుంచి దేవస్థానం ఆవరణలో ఉన్న రథం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. వివిధ రకాల పూలు, విద్యుత్ బల్బులు, మామిడి తోరణాలతో ముస్తాబుచేసిన రథంపై స్వామి దంపతులను ఉంచి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు రథాన్ని లాగి భక్తి పారవశ్యంతో పులకించిపోయారు.

ఉత్సాహంగా ఎడ్లబండ్ల ఊరేగింపు..

శ్రీరుక్మిణి పాండురంగస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఎడ్లబండ్ల ఊరేగింపు ఉత్సాహంగా జరిగింది. కల్లంగుట్టపై దేవాలయం చుట్టూ రైతులు ఎడ్లబండ్లతో ప్రదక్షిణలు నిర్వహించి.. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ వంశపరంపర ధర్మకర్త నర్సింహాయ్య, జాతర ప్రచార కార్యదర్శి ఎంకిగారి అశోక్, మాజీ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొకుంట్ల నర్సింహారెడ్డి, వావిళ్ల మేఘారెడ్డి, గూడెం యాదయ్య, గ్రామ పెద్దలు వావిళ్ల బాల్‌రెడ్డి, బానూరు వెంకట్‌రెడ్డి, అర్చకుడు వైష్ణవ నరేష్ పాల్గొన్నారు.

మార్మోగిన హనుమాన్ నామస్మరణ



పాలకొండలో అభయాంజనేయస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని పాలకొండలో ఆదివారం తెల్లవారుజామున అభయాంజనేయస్వామి రథోత్సవం కనులపండువగా జరిగింది. సుందరంగా అలంకరించిన రథంపై అభయాంజనేయ స్వామి ఉత్సవ మూర్తిని వందలాది భక్తజనం నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా జై హనుమాన్.. జైశ్రీరామ్ నామస్మరణ మార్మోగింది. సాయంత్రం శకటోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

⇨ రూరల్ మండలంలోని తెలుగుగూడెంలో బురుజుగడ్డ ఆంజనేయస్వామి రథోత్సవం నిర్వహించారు. ఆలయంలో అఖండ భజనల అనంతరం జై హనుమాన్, జైశ్రీరామ్ నామస్మరణలతో అంగరంగ వైభవంగా స్వామివారికి గ్రామోత్సవం జరిపారు.

ఎట్టకేలకు డ్రెయినేజీ పనులు ప్రారంభం



కృష్ణా టెంపుల్ చౌరస్తాలో ప్రారంభమైన డ్రెయినేజీ నిర్మాణ పనులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పద్మావతి కాలనీలోని కృష్ణా టెంపుల్ చౌరస్తాలో కొన్ని నెలలుగా నడిరోడ్డుపై మురుగు ఏరులై ప్రవహిస్తోంది. ఈ విషయంపై 'సాక్షి'లో గతేడాది నవంబర్ 16న 'గుడికి వెళ్లాలంటే.. మురుగు దాటాల్సిందే!' కథనంతో పాటు గతనెల 12న మరోసారి 'కంపుకొడుతున్న కాలనీలు.. డ్రెయినేజీలు అస్తవ్యస్తం..' శీర్షికన వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఎట్టకేలకు స్పందించిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఆదివారం అక్కడ డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. కాగా, త్వరలోనే మురుగు సమస్య పరిష్కారం కానుండటంతో స్థానికులతో పాటు కాళికామాత దేవస్థానం, శ్రీకృష్ణుడి గుడికి నిత్యం వెళ్లే భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వీరంతా 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

అంబేడ్కర్ ఆశయాలు సాధించాలి



కారుకొండలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

నవాబుపేట: పీడిత ప్రజల అభ్యున్నతికి కృషిచేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కారణజన్ముడని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. ఆదివారం మండలంలోని కారుకొండలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు రమేశ్, పత్తి నర్సింహులు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. అణగారిన జాతుల సంక్షేమాన్ని కాంక్షించిన అంబేడ్కర్.. రాజ్యాంగ రచనలో వారికి పెద్దపీట వేశారన్నారు. ప్రపంచం మొత్తం ఆయనను మేధావిగా పిలుస్తుందంటే.. ఆయన దేశానికి అందించిన రాజ్యాంగం గొప్పతనమని అన్నారు. ఆయన పొందుపరిచిన అనేక చట్టాలు కేవలం దళిత వర్గాలకే కాకుండా, దేశ ప్రజలందరికీ మేలు చేస్తున్నాయని ఆయన వివరించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆయన ఆశయాలు సాధించే దిశగా అడుగులు వేయాలని కోరారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహ దాత పత్తి లక్ష్మమ్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మహిళా అధ్యక్షురాలు సరళాదేవి, తెలంగాణ అధ్యక్షుడు వెంకటస్వామి, నర్సింహులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పురుషోత్తం, మాజీ ఎంపీటీసీ గోపాల్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, రవి, తిరుపతయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

ఎంపీ దీపారాధన



అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తి వెలిగిస్తున్న ఎంపీ డీకే అరుణ తదితరులు

పాలమూరు: బీజేపీ కేంద్ర కమిటీ పిలుపుమేరకు పార్టీ దళిత మోర్చ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎంపీ డీకే అరుణ నీటితో కడిగి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి దీపాలు వెలిగించి ఘనంగా నివాళులర్పించారు.

రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దు



కొమిరెడ్డిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల/దేవరకద్ర రూరల్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వకుండా వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి, దేవరకద్ర మండలం గుడిబండలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. యాసంగిలో పండించిన వరిధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు ఎలాంటి ఇబ్బందులు పడొద్దన్న ఉద్దేశంతో గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైతులకు సరిపడా గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమచేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సన్నరకం ధాన్యం క్వింటాల్‌కు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శెట్టిశేఖర్, బగ్గి కృష్ణయ్య, బాలనర్సింహులు, నిరంజన్, బాలరాజు, కృష్ణయ్య, పటేల్ నర్సింహారెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాణానికి పాటుపడదాం



కోయిల్‌సాగర్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

దేవరకద్ర: మహాత్మా గాంధీజీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానాలను అనుసరించి సమసమాజ నిర్మాణానికి పాటుపడాల్సిన బాధ్యత అందరిపై ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం మండలంలోని కోయిల్‌సాగర్, చిన్నరాజమూర్ గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. సత్యం, అహింస మార్గాల్లో పయనించి మహాత్మా గాంధీజీ, అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలని కోరారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, నర్వ శ్రీనివాస్‌రెడ్డి, రాంపాండు, జవహర్, వేణుగోపాల్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, గోపాల్, నాగిరెడ్డి, వెంకటేశ్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాజాపూర్: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తెర కృష్ణయ్య కార్యకర్తలకు సూచించారు. మండలంలోని రాయపల్లి, ముదిరెడ్డిపల్లి గ్రామాల్లో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలు ప్రతి గడపకు అందేలా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని.. రాయపల్లి నుంచి పోలేపల్లి వరకు బీటీరోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులకు ప్రతిపాదనలు పంపించినట్లు వివరించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కావాల్సిన నిధులు మంజూరు చేస్తారని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దూళ్ల లింగం, కృష్ణయ్యగౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలకు అవార్డు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌కు నేషనల్ కళాజ్యోతి అవార్డు లభించింది. ఆదివారం రాష్ట్ర భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో జేసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస రాజు చేతులమీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. సామాజిక సేవా రంగంలో అందిస్తున్న విశిష్ట సేవలకు గాను ఈ అవార్డు ప్రదానం చేసినట్లు ఆనంద్ తెలిపారు.

బీపీ మండల్ సేవలు చిరస్మరణీయం

జడ్చర్ల: బీసీ రిజర్వేషన్ల పితామహుడు బిందేశ్వర్ ప్రసాద్ మండల్ సేవలు చిరస్మరణీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు కృష్ణయాదవ్ అన్నారు. బీపీ మండల్ 43వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం జడ్చర్ల ఎమ్మార్పీ భవనం ఆవరణలోని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జహంగీర్ పాషా, కృష్ణ, శేఖర్, నిరంజన్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నిరుపేద ఎరుకలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఏకలవ్య ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు రాగిరి నర్సింహులు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏకలవ్య భవనంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక గ్రామాల్లో ఎరుకలకు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. సమావేశంలో రామకృష్ణ, అన్నగాని బాల్‌రాజు, కావేటి శశిధర్, శ్రీనివాసులు, నాగరాజు, శివమ్మ, కమలమ్మ, లక్ష్మయ్య ఉన్నారు.

మైసమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నవాబుపేట: మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ దేవాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మైసమ్మ కొలువుదీరిన అటవీ ప్రాంతం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది.

కులమతాలకు అతీతంగా జీవించాలి

మిడ్జిల్: సమాజంలో ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా జీవించాలని తహసీల్దార్ రాజు, ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని బైరంపల్లిలో పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లోని దేవాయాలల్లోకి దళితులను వెళ్లవద్దని చెప్పే హక్కు ఎవరికీ లేదన్నారు. ఎవరైనా రెండు గ్లాసుల విధానం పాటిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం అన్నివర్గాల ప్రజలతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సురేశ్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కుర్మయ్య, మాణిక్యరాజు, జగన్, దీప్లానాయక్, ఈశ్వర్, రమేశ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు నైపుణ్యాభివృద్ధి పెంపొందించుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ కోచ్ చెన్న గోపి సూచించారు. ఆదివారం స్థానిక లక్ష్మీనగర్‌కాలనీలోని మాత రాజరాజేశ్వరి-షిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మిల్లెట్స్, ఆర్గానిక్ వస్తువులతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. స్వదేశీ వస్తువులను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జయప్రకాశ్, ఉపాధ్యక్షులు రాఘవరెడ్డి, రవీందర్, సభ్యులు ఆర్.వెంకటయ్య, భూషణ్ పాండే, సుజాత, జ్యోతి, లలిత, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు



ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించిన రుక్కంపల్లి గ్రామస్తులు

నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్ల పంచాయతీ పరిధిలోగల రుక్కంపల్లి గ్రామస్తులు తాగునీటి కోసం రోడ్డెక్కారు. ఖాళీ బిందెలతో రుక్కంపల్లి – ఇప్పటూరు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. గ్రామస్తుల ఆందోళనలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య మద్దతుగా పాల్గొని మాట్లాడారు. రుక్కంపల్లిలో తాగునీటి ఎద్దడి నెలకొందని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. కాగా, 2గంటల పాటు గ్రామస్తులు చేపట్టిన ఆందోళనతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన నిధులు కేటాయిస్తానని.. రెండు, మూడు రోజుల్లో గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మండల అధికారులకు సూచించారు. ఈ మేరకు సంబంధిత అధికారులు గ్రామానికి చేరుకొని గ్రామస్తులకు స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా, అధికార పార్టీ మండల అధ్యక్షుడు స్వయంగా ఆందోళన బాట పట్టడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తంచేశారు.

• లారెక్కిన రైలింజన్..



రైలింజన్ పట్టాలపై వెళ్లాలి కాని.. లారీ ఎక్కడమేమిటని అనుకుంటున్నారా.. అవునండోయ్ నిజమే. ఉత్తరప్రదేశ్ నుంచి కర్ణాటక రాష్ట్రం బళ్లారికి రైలింజన్‌ను తరలిస్తున్న కంటెయినర్ ఆదివారం రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి వద్ద జాతీయ రహదారిపై కొంతసేపు ఆగింది. అక్కడున్న వారు రైలింజన్ లారీ ఎక్కిందని ఆసక్తిగా తిలకించారు.

– రాజాపూర్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



దేవరకద్రలో తమ గురువులతో 2002-03 బ్యాచ్ విద్యార్థులు



మూసాపేటలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న 1998-99 బ్యాచ్ విద్యార్థులు

దేవరకద్ర/అడ్డాకుల: దేవరకద్ర జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో 2002–03లో ఎస్ఎస్‌సీ చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం పట్టణంలోని శ్రీనివాస గార్డెన్‌లో సమావేశమయ్యారు. 22 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు.

⇨ మూసాపేట జెడ్పీహెచ్ఎస్‌లో 1998–99 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరి యోగక్షేమాలను తెలుసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు విశ్వనాథ్, నారాయణ, శివరాములు, జగదీశ్వర్, శ్రీనివాస్‌రెడ్డిలను శాలువా, పూలమాలలతో సత్కరించి మెమోంటోలను అందజేశారు. అనంతరం వేసవి దృష్ట్యా బస్టాండ్ ఆవరణలో చలివేంద్రం ప్రారంభించారు.

⇨ అడ్డాకుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2010–2012లో ఇంటర్ చదువుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాడు తమకు చదువు చెప్పిన లెక్చరర్లు రామారావు, వెంకటేశ్వర్లు, భాస్కర్, శాంతిరెడ్డి, శ్రీనివాసులును శాలువాలతో సత్కరించారు.